# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-06-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు జమ్మూ కశ్మీర్‌లోని ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైలు లింక్ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు.**

2. **కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు శ్రీ సత్య సాయి జిల్లాలో పర్యటిస్తున్నారు.**

3. **రెపో రేటును 6 శాతం నుంచి 5.5 శాతానికి తగ్గించినట్లు భారతీయ రిజర్వ్ బ్యాంకు - ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు.**

4. **రాష్ట్రాన్ని పర్యాటక ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.**

==========================

జమ్మూ కశ్మీర్ లో పర్యటిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైలు లింక్ -యుఎస్‌బిఆర్‌ఎల్ ప్రాజెక్టును ఈ రోజు జాతికి అంకితం చేశారు. 272 కిలోమీటర్ల పొడవు కలిగిన ఈ ప్రాజెక్టును దాదాపు 44 వేల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించారు. అలాగే కట్‌ఢాలో 46వేల కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు కట్‌ఢా-శ్రీనగర్ మధ్య రైలును ప్రారంభించారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా తీగలతో అనుసంధానించిన అంజీ రైల్వే కేబుల్ వంతెనను కూడా ప్రధానమంత్రి ప్రారంభించారు.

--------------------------

రెపో రేటును 6 శాతం నుంచి 5.5 శాతానికి తగ్గించినట్లు భారతీయ రిజర్వ్ బ్యాంకు – ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. ముంబైలో ద్రవ్య పరపతి విధాన కమిటీ నిర్ణయాలను ఆయన ఈరోజు పాత్రికేయులకు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నా భారత ఆర్థికవ్యవస్థ మాత్రం బలంగా, స్థిరంగా కొనసాగుతోందని చెప్పారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.5శాతంగా నమోదయ్యే అవకాశాలున్నాయని తెలుపుతూ,

వాయిస్ ..26 సెకన్లు

--------------------------

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శ్రీ సత్య సాయి జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో

భాగంగా జిల్లాలోని గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్ డైరెక్ట్ టాక్సెస్, నార్కోటిక్స్- నాసిన్ కేంద్రంలో ఈ రోజు జరిగే పలు కార్యక్రమాలలో పాల్గొంటారని అధికారులు తెలిపారు. నాసిన్ కేంద్రంలో జరిగే కార్యక్రమాలలో పాల్గొనటానికి వచ్చిన కేంద్రమంత్రిని హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికె పార్థసారధి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, బిసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత, బిజెపి నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చేతన్ మర్యాదపూర్వకంగా కలిశారు.

----------------------------

గత దశాబ్ద కాలంలో భారత్ అనేక రంగాల్లో గణనీయమైన మార్పులు సాధించింది. సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమం అనే అంశాల ఆధారంగా గత 11 సంవత్సరాలలో కీలక రంగాలలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా దేశ నాగరికత వైభవాన్నితెలిపేలా సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ ప్రయత్నాల గురించి ఈరోజు తెలుసుకుందాం.

వాయిస్...40 సెకన్లు

----------------------------

రాష్ట్రాన్ని పర్యాటక ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దుతామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. పర్యాటకాభివృద్ధిలో భాగంగా అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్ట్‌కు జూన్ 19న రాజమహేంద్రవరంలో శంకుస్థాపన చేయనున్నామని ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉపముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్, రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరిలు గోదావరి పర్యాటక ప్రాజెక్ట్‌కు శంఖుస్థాపన చేస్తారని చెప్పారు. గోదావరి పుష్కరాలలోపు పనులు పూర్తవుతాయని మంత్రి తెలిపారు.

----------------------------

రాష్ట్రంలో బక్రీద్ సందర్భంగా జంతు వధ సమయంలో చట్టాలను పాటించాలని పశుసంవర్ధకశాఖ సంచాలకులు దామోదర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆవులు, దూడలను వధించినా.. పరిమితికి మించి వాహనాల్లో రవాణా చేసిన గోవధ నిషేధ, పశుసంరక్షణ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. మాంసం కోసం మేకలు, గొర్రెలు, కోళ్లు, చేపలు.. పునరుత్పత్తికి వినియోగం కాని గేదెలను వధించేందుకు మాత్రమే అనుమతి ఉందని స్పష్టం చేశారు.

----------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేశంలో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలను పరిష్కరించారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ఏ. సీత తన అభిప్రాయాన్ని తెలియజేస్తూ,

..వాయిస్.. 26 సెకన్లు

----------------------------

రాష్ట్రంలో మెగా డీఎస్సీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాల్లోకి ఉదయం విడతలో 9 గంటల వరకు అభ్యర్థులను అనుమతించారు. 12 గంటల వరకు మొదటి విడత పరీక్ష జరిగింది. ఇక మధ్యాహ్నం

విడతలో 2 గంటలకు అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. 2 గంటల 30 నిమిషాల నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఈ నెల 30 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఇందుకోసం రాష్ట్రంలో 137, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లో 17 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

మరోవైపు డీఎస్సీ పరీక్షల ప్రారంభం సందర్భంగా అభ్యర్థులందరికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు.

----------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర-2025 పేరుతో నెలరోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా బాపట్ల, కాకినాడ, కృష్ణా, విజయనగరం జిల్లాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్లు, స్థానిక అధికారులు, ప్రజలు పాల్గొని యోగాసనాలు వేశారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని నెల్లూరు నగరంలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ కె.కార్తీక్ పాల్గొని... మాట్లాడుతూ..

..వాయిస్... 30 సెకన్లు

----------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితి గురించి అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి బి. శేఖర్ కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి తెలియజేస్తూ...

వాయిస్.. 30 సెకన్లు

----------------------------

రాష్ట్ర పోలీసు విభాగంలో కృత్రిమ మేధ -ఏఐ వినియోగానికి వీలుగా ప్రిజమ్ పేరిట ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేసేలా ఏఐ ఆధారిత పరిష్కారాల కోసం ఈ నెల 27 నుంచి 29 వరకు ఏఐ హ్యాకథాన్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ హ్యాకథాన్‌లో గుర్తించిన అంశాలను క్షేత్రస్థాయి వినియోగానికి వీలుగా సిద్ధం చేసేలా ప్రిజమ్ పనిచేస్తుందని పేర్కొన్నారు.

======================